క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన లక్ష్మీనారాయణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు మధురవాడ రేవళ్లపాలేనికి చెందిన పిల్లా లక్ష్మీనారాయణ ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 12 వరకు విశాఖపట్నం కోస్టల్ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ సహాయ సహకారాలతో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో లక్ష్మీనారాయణ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 17,18,19 తేదీల్లో గుంటూరు బీఆర్ స్టేడియంలో జరగనున్నాయి. లక్ష్మీనారాయణను మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్ దుర్మరణం



దాకమర్రి శ్రీను (ఫైల్)

తగరపువలస: స్థానిక వెంకటేశ్వరమెట్ట వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దాకమర్రి శ్రీను (40) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొటారుబిల్లికి చెందిన శ్రీను భీమిలి చినబజారు అప్పికొండవీధి వద్ద బ్లూజే అశోకా స్కైలైన్ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి సూరి, కుమారులు దీపక్, సందీప్‌లతో కలిసి శ్రీను విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో వెంకటేశ్వరమెట్ట బస్సు దిగి రోడ్డు దాటుతుండగా విజయనగరం వైపు వెళ్తున్న కారు శ్రీనును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కారు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలం కొమడవోలుకు చెందినదిగా గుర్తించారు. మృతునికి భార్య రమణమ్మ కూడా ఉన్నారు. మృతుని తండ్రి సూరి ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. పెంటలో ఉపాధి హామి పథకం నిధులు రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు, సైడు కాలువలు, అనంతవరం సమీపంలో అలోపాలో గెడ్డపై రూ..30లక్షలతో శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఏఈ కె.ఆర్.పట్నాయక్, మాజీ ఎంపీపీలు డి.గోపాలకృష్ణ మూర్తిరాజు, కె.లీలావతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు బిస్కెట్ల పంపిణీ



కార్మికులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసిన శ్రీను

తగరపువలస: చిట్టివలస సప్తగిరి థియేటర్ వద్ద పాన్‌షాపు యజమాని చింతపల్లి శ్రీను 125 మంది జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. దేశం గర్వించతగ్గ శాస్త్రవేత్త, మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

మూతపడ్డ యునాని వైద్యశాల

దేశీయ వైద్యంగా ప్రజల ఆదరణ పొందుతున్న యునాని వైద్యం భీమిలివాసులకు దూరమైంది. గతంలో టీడీపీ హయాంలో మూతపడ్డ వైద్యశాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి, సేవలు అందించింది. రోగుల ఆదరణ పొందుతున్న సమయంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో మందుల కొరతతో మళ్లీ మూతపడింది. దీంతో రోగుల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి.

- వైఎస్సార్‌సీపీ హయాంలో అందుబాటులో వైద్యం
- కొత్త ప్రభుత్వం వచ్చాక సరఫరా కాని మందులు
- దాదాపు మూడు నెలలుగా మూత
- రోగుల అవస్థలు



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని యునాని వైద్యశాల



గత ప్రభుత్వ హయాంలో అందుబాటులో ఉన్న యునాని మందులు (ఫైల్)

భీమునిపట్నం: భీమిలిలో ఆయుర్వేదం, హోమియోతో పాటు యునాని వైద్యానికి కూడా మంచి ఆదరణ ఉండేది. ఈ కారణంగా 35 సంవత్సరాల క్రితమే ప్రభుత్వం భీమిలిలో యునాని వైద్యశాలను అద్దె భవనంలో ప్రారంభించి, డాక్టర్‌ను నియమించింది. ఇందులో దీర్ఘకాలిక రోగాలకు బాగా పని చేసే లేహ్యాలు, తైలాలు, పొడులు, మందులు ఉండేవి. ఇవి వాడడం వల్ల మంచి ఫలితాలు ఉండడంతో రోగులు పెద్ద సంఖ్యలో వచ్చి, వైద్యుని సలహాపై మందులు తీసుకువెళ్లేవారు. ఈ క్రమంలో 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని భవనంలోకి ఈ వైద్య శాలను తరలించారు. అప్పటి నుంచి ఇక్కడే ఈ వైద్యశాల నిర్వహిస్తున్నారు. అయితే 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోకపోవడంతో మందుల సరఫరా సరిగ్గా జరగక ఇది మూతపడిపోయింది. దీంతో ఈ వైద్యంపై ఆధారపడ్డ వందలాది మంది రోగులు ఇబ్బంది పడ్డారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అందుబాటులోకి..

ఈ పరిస్థితుల్లో యునాని వైద్యంపై ఆధారపడ్డ రోగుల అవసరాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడి వైద్యశాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఒక వైద్యురాలిని నియమించి, సుమారు 40 రకాల మందులను ఏర్పాటు చేసింది. దీర్ఘకాలిక సమస్యలైన చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, వాతం నొప్పులు, ఆస్తమా, సైనసైటిస్, మైగ్రేన్ తల నొప్పి, ఎలర్జీ, ఊపిరితిత్తుల సమస్యలు, గైనిక్, కిడ్నీ సమస్యలతో పాటు ఇంకా మరిన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచారు. దీంతో రోగులు డాక్టర్‌కు చూపించుకుని, మందులు వాడేవారు. వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో రోగుల సంఖ్య పెరిగింది. రోజుకు 50మంది వరకు వచ్చి డాక్టర్‌కు చూపించుకునేవారు. దీంతో పూర్తిస్థాయిలో మరిన్ని ఖరీదైన మందులను అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు సన్నాహాలు చేశారు.

ప్రభుత్వం మారడంతో మళ్లీ మూత

వైద్యశాల మంచి ఆదరణ పొందడంతో పాటు ఎక్కువ మందులు అందుబాటులోకి రానున్న తరుణంలో ప్రభుత్వం మారిపోయింది. వైద్యశాలకు ఎప్పటికప్పుడు మందులు సరఫరా చేయాల్సి ఉంది. కానీ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మందుల సరఫరా జరగలేదు. అన్ని మందులు అయిపోవడంతో కొద్ది రోజుల క్రితం ఈ వైద్యశాల మూతపడిపోయింది. దీంతో ఈ మందులపై ఆధారపడ్డ రోగులు ఇబ్బంది పడుతున్నారు.

మోకాళ్ల నొప్పులకు మందులు వాడేవాడిని



నాకు చాలాకాలం నుంచి మోకాళ్ల నొప్పులు ఉన్నాయి. యునాని వైద్యశాలలో డాక్టర్‌కు చూపించుకునేవాడిని. నొప్పులు బాగా తగ్గాయి. తిరగగలుగుతున్నాను. ఇప్పుడు మళ్లీ యునానీ వైద్యశాల మూతపడింది. అర్ధంతరంగా మందులు ఆపేయడంతో సమస్య మళ్లీ మొదలవుతోంది. అధికారులు, ప్రభుత్వం స్పందించాలి. వైద్యశాలను మళ్లీ తెరిపించాలి.

– ఆర్.సత్యనారాయణ, భీమిలి

మందులు బాగా పని చేసేవి



దీర్ఘకాలిక రోగాలకు యునాని మందులు బాగా పని చేస్తున్నాయి. నాకు అజీర్ణ సమస్య ఉంది. యునాని మందులు బాగా పని చేశాయి. చాలా వరకు సమస్య తగ్గింది. అంతా బాగుంది అనుకున్న సమయంలో మళ్లీ మూతపడింది. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిని మళ్లీ అందుబాటులోకి తీసుకు రావాలి. –పి.వరలక్ష్మి, భీమిలి

అధికారులకు సమాచారం అందించాం



ఇక్కడ వైద్యశాలలో అవసరమైన మందులు అయిపోవడంతో ప్రస్తుతం దీన్ని మూసివేశాం. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేశాం. అక్కడి నుంచి మళ్లీ అవసరమైన మందులు వస్తే ఈ వైద్యశాల మళ్లీ పని చేయడంతో పాటు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

–ప్రతిభ, యునాని వైద్యురాలు

కలాం సేవలు నిరుపమానం

- విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపిన మహనీయుడు
- డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి
- మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



చంద్రంపాలెం హైస్కూల్లో కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గంటా



కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తదితరులు



కలాం చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులు

భీమునిపట్నం: శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం మన దేశానికి చేసిన సేవలు నిరుపమానమని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా డైట్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మన దేశానికి లభించడం ఎంతో అదృష్టమే కాకుండా, గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన నిత్యం దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు నిరంతరం విద్యార్థులను కలుస్తూ వారిలో స్ఫూర్తిని నింపి, ఎన్నో విధాలుగా ప్రోత్సహించారని అన్నారు. అటువంటి మహానుభావుడిని అందరం గుర్తుంచుకోవడంతో పాటు పలువురికి తెలియపరచాలని అన్నారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయిని కలాం చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, సి.ఎ.సోమయాజులు, ఆర్.నీలిమ, పి.హరిణి, జి.రవి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం: ఎమ్మెల్యే

మధురవాడ: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కలాం జయంతి సందర్భంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జీవన్ కుమార్, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానం సమస్యపై ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావులతో ఎమ్మెల్యే చర్చించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి, కలెక్టర్ కూడా చెప్పారన్నారు. నీరు నిల్వ ఉండకుండా మైదానం చదును చేయాలని అధికారులకు సూచించారు.

విద్యార్థులు కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

తగరపువలస: విద్యార్థులంతా కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మిలి జోన్ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు సూచించారు. కలాం జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం సూచించిన తపన, ఆశయం, ఆశలను విద్యార్థులు ఏనాడూ చేజార్చుకోవద్దన్నారు. ప్రపంచ శాంతి కోసం తపించిన ఆయన జయంతిని ఐక్యరాజ్యసమితి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు



శివశక్తినగర్‌లో పర్యటిస్తున్న సీపీఐ కార్యదర్శి పైడిరాజు తదితరులు

మధురవాడ: సామాన్యులపై పిడుగుల్లా పడుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ మధురవాడ జోన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని మధురవాడ శివశక్తినగర్‌లో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో ఆయన మాట్లాడుతూ మోదీ 3వ సారి అధికారం చేపట్టిన తర్వాత వ్యాపారస్తుల పండగ చేసుకున్నారన్నారు. ధరలు నియంత్రించే నాథుడే లేక బ్లాక్‌మార్కెట్ విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. వంటనూనెల ధరలు భగ్గుమంటున్నాయన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కలగజేసుకుని ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు ఎండీ బేగం, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎస్‌కే సల్మా, బి.కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం



చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న మ్యాజిక్‌బస్ ప్రతినిధులు

తగరపువలస: చేతుల శుభ్రతతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని మ్యాజిక్ బస్ ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతులు ఏడు విధాలుగా శుభ్రం చేసుకోవచ్చని తెలియజేశారు. ప్రతిరోజూ వాష్‌రూమ్‌కు వెళ్లిన తరువాత, ఆటలు పూర్తయినప్పుడు, తినడానికి వెళ్లే ముందు, పెంపుడు జంతువులను తాకేటప్పుడు విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోకపోతే ప్రమాదకరమైన బ్యాక్టీరియా పొట్టలోకి చేరి వ్యాధుల బారిన పడేస్తాయని వివరించారు. కార్యక్రమంలో మ్యాజిక్‌బస్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు, మ్యాజిక్‌బస్ ప్రతినిధులు కె.రమణమ్మ, ఎం.సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

యానాద్రి చెరువు పరిశీలన



యానాద్రి చెరువు వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న వ్యర్థాలను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ మీనా కుమారి

పద్మనాభం: మండలంలోని రేవిడిలో జంతు కళేబరాలు, వ్యర్థాలు వేస్తున్న యానాద్రి చెరువును ఈవోఆర్డీ మీనా కుమారి మంగళవారం పరిశీలించారు. చెరువులో జంతు కళేబరాలు, వ్యర్థాలు వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోందని రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు ఇటీవల ఈవోఆర్డీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవోఆర్డీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు పాదవునా ఉన్న జంగిల్‌ను తొలగించేందు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యర్థాలను తొలగించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. ఆమె వెంట రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మజ్జి శంకర్, రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి నూర్జహాన్ ఉన్నారు.

వీధి దీపాలపై నిర్లక్ష్యపు నీడ



జీరుపేట ఒడిశా దాబా ఎదురుగా చెట్టు మధ్యలో వీధి లైటు



జీరుపేట కూడలిలో వీధి లైటును చుట్టేసిన తీగజాతి మొక్కలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు జీరుపేటలో వీధిదీపాల వెలుగులను రోడ్డు పక్కన చెట్లు కమ్మేశాయి. ఏడాకుల పొన్నాకుల చెట్లు గుబురుగా పెరగడం, వీధిదీపాల స్తంభాలపై తీగ జాతి మొక్కలు పాకడంతో వెలుగులను తమలోనే దాచుకుంటున్నాయి. అసలే తగరపువలస–భీమిలి రోడ్డులో సాయంత్రం అయితే పశువులు తిష్ట వేసి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంటాయి. ప్రస్తుతం చెట్ల మాటున వీధిదీపాల కారణంగా రోడ్లపై అంధకారం అలముకుంటోంది. జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది వీధిదీపాల చుట్టూ అలముకున్న చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలను తొలగించాలని జీరుపేట గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

20న 'ఐక్యరాజ్య సమితి'పై పోటీలు

తగరపువలస: ఐక్యరాజ్యసమితి స్థాపించి ఈ నెల 24తో 79 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఈ నెల 20న జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 24న బహుమతులు అందిస్తామని మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. మరిన్ని వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

పిల్లల్లో అభ్యసన వైకల్యాలపై అవగాహన



మధురవాడలో అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు



రెడ్డిపల్లిలో ర్యాలీ చేస్తున్న దివ్యాంగ విద్యార్థులు

మధురవాడ: అభ్యసన వైకల్యాలను తొలగించి, పిల్లల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎంఈవో పి.అనురాధ తెలిపారు. డిస్లెక్సియా అవేర్‌నెస్ మాసోత్సవాలలో భాగంగా మధురవాడలోని మినీ భవిత కేంద్రంలో వాక్ ఫర్ డిస్లెక్సియా పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అభ్యసన వైకల్యాలను ఎలా అధిగమించాలి, తీసుకోవలసిన చర్యలపై విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పిల్లలపై ఎటువంటి ఒత్తిడి కలించకుండా, వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయడంతో పాటు వారి వెనుకబాటు తనాన్ని అధిగమించేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైకల్యం ఉన్న పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి, వీటి సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ రవికృష్ణ, భవిత కేంద్రం శిక్షకులు ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కే సలీమాసహిజి తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం: అక్షరాలను, పదాలను అర్థం చేసుకోలేని అభ్యసన లోపంపై స్థానిక భవిత కేంద్రానికి చెందిన పిల్లలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో శివరాణి మాట్లాడుతూ ఈ లోపంతో పాటు మాటలు కూడా సరిగ్గా పలకడానికి ఇబ్బంది పడుతున్న పిల్లలు చాలామంది ఉన్నారని, ఇటువంటి పిల్లల్ని గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తామని చెప్పారు. తద్వారా వారి జీవన శైలిలో మంచి మార్పులు వస్తాయని దీనిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, భవిత కేంద్ర ఇన్‌చార్జి కేజియా, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో..

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో అభ్యసన వైకల్యం గల (డిస్లెక్సియా) పిల్లలను గుర్తించేందుకు మంగళవారం భవిత కేంద్రం దివ్యాంగ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్సు హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదాలను సరిగా పలక లేకపోవడం, చదవడంలోను, అర్థం చేసుకోవడంలోను లోపం ఉన్న వారిని గుర్తించడం కోసం అవగాహన కల్పిస్తూ ఈ ర్యాలీ చేపట్టామన్నారు. ర్యాలీలో ఐఈఆర్టీలు ఎం.శ్రీనివాసరావు, హెచ్.రాజ్ కుమార్, ఉపాధ్యాయిని కళావతి పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయాల్లో పోస్టులకు 90 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని రెండు కస్తూర్బా విద్యాలయాల్లోని నాలుగు పోస్టులకు 90 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంఈవో పి.రమణ తెలిపారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో డే అండ్ నైట్ వాచ్‌మన్ పోస్టుకు 33 మంది, రెడ్డిపల్లి కస్తూర్బా విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టుకు 24మంది, అసిస్టెంట్ కుక్‌కు 28 మంది, చౌకీదార్ పోస్టుకు ఐదుగురు దరఖాస్తు చేసినట్లు తెలియజేశారు.

గిడిజాల భూములపై విచారణ

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల రెవెన్యూ పరిధిలో రెండు వేర్వేరు ఫిర్యాదుల మేరకు భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాథుర్, ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు మంగళవారం పరిశీలించి విచారణ చేపట్టారు. కర్రి అప్పలనాయుడు అనే ఫిర్యాది సర్వే నంబర్ 178/12లో 18 సెంట్లు డి పట్టా భూమికి సంబంధించి, అలాగే అదే గ్రామ పంచాయితీలో మరో ఫిర్యాది షిణగం గౌరమ్మ పట్టా నంబర్ 2379, సర్వే నంబర్ 185/10లోని 45 సెంట్లు డి పట్టా భూములకు సంబంధించి ఈ విచారణ చేపట్టారు. త్వరలో మళ్లీ గిడిజాలలో పర్యటించి పూర్తి విచారణ చేపట్టి ఫిర్యాదులపై నిజానిజాలు వెలికితీస్తామని తహసీల్దార్ తెలిపారు.

పీహెచ్‌సీలో వైద్యసేవలపై కేంద్ర బృందం ఆరా



ఆనందపురం పీహెచ్‌సీలో కేంద్ర బృంద ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై డాక్టర్ జైత్రి ఆధ్వర్యంలోని ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం మంగళవారం ఆరా తీసింది. అసంక్రమిత వ్యాధులపై రోగులకు అందుతున్న సేవల గురించి లొడగలవానిపాలెం, వేములవలసకు చెందిన వారితో మాట్లాడి తెలుసుకున్నారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను ఎలా గుర్తిస్తున్నారు, వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి సమత, జిల్లా హెచ్‌డబ్ల్యూసీ నోడల్ అధికారి బాలాజీ, పీహెచ్‌సీ వైద్యులు ఎం.గంగునాయుడు, షెహనాజ్ సాధియా తదితరులు పాల్గొన్నారు.

పార్కా.. పశువుల శాలా?

- గేదెలను కట్టి తాళం వేస్తున్న స్థానికుడు
- స్థానికుల ఆగ్రహం



జీవీఎంసీ పార్కులో గేదెలు

కొమ్మాది: పబ్లిక్ పార్కులో పశువులను కట్టేసి, పశువుల శాలగా మార్చేస్తున్నాడు ఓ వ్యక్తి. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ జీవీఎంసీ పార్కులో ఓ వ్యక్తి తన గేదెలను ఉంచి పార్కు గేటుకు తాళం వేశాడు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కులో ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేస్తుంటామని, సెలవు దినాల్లో పిల్లలు ఆడుకుంటారని అలాంటి పార్కును ఇలా దుర్వినియోగం చేయడం సరికాదని అంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, వాకర్లు కోరుతున్నారు.

రహదారి గుంతలమయం



జాతీయరహదారి నుంచి తర్లువాడకు వెళ్లే రహదారి దుస్థితి

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి ప్రవేశించే మార్గంలో బోర్డులు, వీధిలైట్లు కూడా లేవని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీలో ఉచితంగా మందులు ఇచ్చే అతి పెద్ద హోమియో ఆసుపత్రి వద్ద కొంగర రమేష్ దగ్గరకు శని, ఆదివారాలలో సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం వస్తుంటారు. ఆ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో వీధి దీపాలు, రోడ్లు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తర్లువాడ పంచాయతీలో రోడ్లు పునరుద్ధరించాలని సామాజిక కార్యకర్త కోరాడ ఆదినారాయణ తదితరులు కోరుతున్నారు.